# విభూతి సంస్కారం

"ఎంత డబ్బయినా ఖర్చు పెడదాం డాక్టర్‌గారూ. మీరు దీని మీద లిట్రేచరు, ట్రెయినింగు ఏది కావాలన్నా బొంబాయో, కలకత్తానో, ఢిల్లీయో వెళ్ళి రండి" అన్నారు ఎ అండ్ యు. కంపెనీ జెనరల్ మేనేజరు సుబ్బారావుగారు. "మా మరదలు వ్యాధి నయం చేస్తిరా, మీకు స్పెషల్ సర్జన్ అని వొక కొత్త పోస్టు శాంక్షన్ చేయించి మిమ్మల్ని ప్రొమోట్ చేస్తా"నన్నారు.

దాంతో ఉబ్బయ్యాను. కేన్సరు, అయితే మాత్రం బాగుచెయ్యలేకపోతామా అని!

"ముందు శెలవుపెట్టి వెళ్ళండి. అట్నుంచి రాగానే ట్రెయినింగ్-కమ్-టూర్ ఆర్డరు వేద్దాం." అని సుబ్బారావుగారు సలహా యివ్వగా, రెండువేల రూపాయలు రమణారావుగారి దగ్గిర తీసుకుని బయల్దేరాను.

బొంబాయి, ఢిల్లీ, గట్రా వెళ్ళాను. సుబ్బారావుగారి మరదలు రమాబాయిగారి కేస్ హిస్టరీ కాపీలు ఒక్కొక్కరికిచ్చి కేన్సర్ స్పెషలిస్టులందరితో మాట్లాడాను. వారి సలహాలు నోట్ చేసుకున్నాను. వారందరు రికమండు చేసిన పుస్తకాలు కొన్నాను. నెల్లాళ్ళ తరవాత వూరుచేరాను.

ఇంటికి చేరగానే సుబ్బారావుగారి బంగ్లాకి ఫోన్‌చేసి, "అమ్మాయిగారి కెలావుంది" అని భోగట్టా చేశాను.

"మా బంగ్లాకి రండి" అని ఫోను పెట్టేశారు సుబ్బారావుగారు. ముఖ్యమైన పుస్తకాలొక నాలుగు, కొన్ని మందులు బ్రీఫ్‌కేస్‌లో సర్దుకుని, అరగంట గడిచేలోగా బంగ్లాకి చేరాను.

రమాబాయిగా రుండవలసిన దక్షిణపు గదిలోకి వెళ్ళిపోయాను, సరాసరి. కాని ఆవిడ మంచం వుండవలసిన చోట ఒక పీఠం, దానిమీద ఒక స్వామీజీ- గదినిండా అగరొత్తుల వాసన, స్వామీజీ ధ్యానంలో వున్నారు.

ఒక బంట్రోతు గబగబా, నిశ్శబ్దంగా వొచ్చేసి; "అయ్యగారు

ఈ గదిలో వున్నారండి" అని గుసగుసలాడి, తూర్పు గదిలోకి తీసు కెళ్ళాడు.

మంచంమీద రమాబాయిగారు నిద్రపోతున్నారు. దూరంగా వాక సోఫాలో సుబ్బారావుగారు, మరొకాయన కూర్చున్నారు.

నేను గదిలో కెళ్తూనే బ్రీఫ్‌కేసు అక్కడ పెట్టి చనువుగా రమా బాయిగారి మంచం దగ్గర కెళ్ళాను. పల్స్ చూశాను. స్టెత్ పెట్టాను.

ఆశ్చర్యం! ఆవిడ నిద్రపోడంలేదు. స్పృహలోనే లేరు, "కోమా"లో వున్నారు. అవి ఇంచుమించు ఆఖరిక్షణాలు, ఆవిడకి....

సుబ్బారావుగారి వేపు తీక్షణంగా, ఆందోళనగా చూశాను. ఆయన నన్ను చిరునవ్వుతో ఆహ్వానిస్తూ, తన ప్రక్కన చోటు చేశారు.

గడియారం ఐదు గంటలు కొట్టింది.

"వీరు డాక్టర్ ఆదిశంకర్ గారని, బొంబాయిలో వుండేవారు. ప్రస్తుతం మన కంపెనీ స్పెషల్ సర్జన్" అని సుబ్బారావుగారు తన ప్రక్కన వున్న వ్యక్తికి పరిచయం చేశారు.

"మనం బొంబాయిలో ఇటీవలే కలిశాం. రమాబాయిగారి కేసు గురించి మీకు చెప్పగా నేను చేసిన వైద్యం సరైందని అన్నారు మీరు" అన్నాను.

"జై ఆదిశంకర్! జై ఉమాశంకర్!!" అని పెద్దగా అరుస్తూ, నే నిందాక దక్షిణపు గదిలో చూసిన స్వామీజీ వొచ్చాడు. డాక్టర్ ఆదిశంకర్ ఆయనకి నమస్కారం చేసి, పాదధూళి నెత్తిన పెట్టుకొని, ఆయన్ని రమాబాయిగారి మంచం దగ్గరికి తీసుకెళ్ళారు. స్వామీజీ తన చేతిలో విభూతి కొంత ఆవిడ నుదుటరాసి, ఒక చిటికెతో కొంత పట్టుకొన్నారు. ఆదిశంకర్ వెంటనే రమాబాయిగారి పెదవులను చేత్తో విడదీశాడు. స్వామీజీ విభూతి వేశారు.

"ఇది అన్యాయం, డాక్టర్ ఆదిశంకర్!" అన్నాను.

స్వామీజీ ఉగ్రులై చూశారు నా వేపు. "హు యీజ్ దిశ్మాన్? డిస్మిస్ హిం!" అన్నారు సుబ్బారావుగారితో.

"మీరు రేపురండి" అన్నారు సుబ్బారావుగారు, నడుంమీద చెయ్యేసి నన్ను బయటకు లాగి

కారెక్కుతూ వుండగా బంట్రోతు ఒక కవరు తెచ్చిచ్చాడు. "స్టెనోగారిమ్మన్నా" రంటూనూ. జేబులో కుక్కాను దాన్ని.

"మీరు పెద్ద వుద్యోగంలో వుండీకూడా వరసగా నెల్లాళ్ళపాటు డ్యూటీకి రాక బాధ్యతారహితంగా ప్రవర్తించేరు అయినా మీరు సీనియర్ వుద్యోగి కనుక, కంపెనీ వారు మీ స్వగ్రామానికి, మీ దగ్గర బంధువుల వూళ్ళకు కబుర్లు చేసికూడా, మీ పత్తా తెలుసుకోలేకపోయి, మిమ్మల్ని బర్తరఫ్ చేయాలని నిశ్చయించారు." అనుంది, ఆ ఆ ఉత్తరంలో. కింద జనరల్ మేనేజర్, ఎ అండ్ యు. కంపెనీ సుబ్బారావుగారి సంతకం.

రాత్రంతా బాధపడ్డాను. "పాపం రమాబాయిగారి గతి ఏమౌతుందో! ఆవిడకి విభూతి ట్రీట్‌మెంటు తప్ప ఏమీ ఇవ్వనట్టుంది. ఈ నెలరోజులనుంచీనూ ఆదిశంకర్‌గారికి బాగా తెలుసు. ఏంచేస్తే ఆమె ఇంకా కొన్నాళ్ళు జీవిస్తారో. కాని అతనేం చేయడంలేదు, స్వామీజీకి మొక్కడం తప్ప" అనుకుంటూ.

తెల్లారింది.

నా ఉద్యోగం పోయిందని రాత్రి నేనెవరికీ చెప్పలేదు. కాని మా ఇంట్లో అందరు ఏడుస్తున్నారు. "అదేమర్రా" అంటూ అడిగాను. పరుపుకింద పెట్టిన లెటర్ నేను నిద్రపోయాక చదివేశారేమోనని అనుమానిస్తూ.

"కొంప మునిగిందండీ బాబూ! పాపం రమాబాయిగారు పోయారు" అంది మా ఆవిడ. మేం యాడవకపోతే ఆ సంగతి ఎవరో జి. ఎం. గారింట చెప్పేసి మామీద కక్ష సాధిస్తారని భయపడ్డ దాన్లాగా.

"ఊరుకోం డూరుకోండి, మనం యాడవ్వాలిసింది అందుక్కాదు. మనలో పేరుకుపోయిన అజ్ఞానానికి, మన విభూతి సంస్కారానికి!" అన్నాను.

(15-7-78)